## క్లుప్తంగా

### రేషన్ బియ్యం వ్యాన్ సీజ్



నాగాయలంక: స్థానిక తిప్పాలెం రామాలయం ప్రాంతంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ– 2 రేషన్ వాహనాన్ని శనివారం రాత్రి తనిఖీ చేసి అతకతవకలను గుర్తించినట్లు పడీడీఎస్ డీటీ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వాహనంలో 200 కేజీల రేషన్ బియ్యం, పంచదార అరకేజీ ప్యాకెట్లు 50 అదనంగా నిల్వ ఉన్నట్లు కనుగొన్నామని చెప్పారు. తక్షణం ఎండీయూ–2 రేషన్ వాహనాన్ని సీజ్ చేసి, నాగాయలంకలోని రేషన్ షాపు (6) డీలర్‌కు సరుకులతో సహా అప్పగించామని, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని డీటీ వివరించారు.

### రావూరి భరద్వాజ స్ఫూర్తి పురస్కారం ప్రదానం



అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన రచయిత్రి, విశ్రాంత ఉపాధ్యాయురాలు సింహాద్రి పద్మ, రావూరి భరద్వాజ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో గుడివాడ శ్రీనివాస మహల్ సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పద్మకు వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా, రచయితగా పద్మ ఎంతో గుర్తింపు పొందారని కొనియాడారు. రిటైర్డ్ ఎంఈవో భవిరి శంకరనాథ్, ప్రముఖ రచయిత వసుధ బసవేశ్వరరావుతో పాటు పలువురు సాహితీవేత్తలు, రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పెడన: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన పట్టణ, మండల అధ్యక్షులు బండారు మల్లికార్జునరావు, కొండవీటి నాగబాబు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ కుటుంబ సభ్యులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా వారు కోరారు. పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదేశాల మేరకు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా గ్రామాలలో వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి కేకులు కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని, సేవా కార్యక్రమాల్లోపాలుపంచుకోవాల్సిందిగా సూచించారు.

### అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మలిశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ (రాజా) చేతుల మీదుగా రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. జనసేన కార్యకర్తలు రూ.40 వేలు సమీకరించగా, మరో పది వేల రూపాయలను మండల శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వితరణ చేశారు. గ్రామ సర్పంచి మండలి ఉదయభాస్కర్, భోగాది సోమశేఖర్(చిన్నారి), పాలిశెట్టి మురహరి, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, బుచ్చిబాబు, పేటేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గురుపూజ



బంటుమిల్లి: గురుపూజ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రామాలయంలో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ప్రముఖ సీనియర్ న్యాయవాది, బంటుమిల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్యాంబాబు మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖపాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యవక్త మోహన్ మాట్లాడుతూ వ్యక్తిని గురువుగా కాకుండ స్వార్థం, వివాదాలకు తావు లేకుండా ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్జీ కాషాయ ధ్వజాన్ని గురువుగా అందించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవకులు భగవద్ధ్వజానికి తమ శక్తి కొలది గురుదక్షిణ సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వయం సేవకులు చిన్నలు, పెద్దలు పాల్గొన్నారు.

# 'దివి'పై వైఎస్సార్ చెరగని ముద్ర

- రాష్ట్రంలో తొలి ఫిషరీస్ కాలేజీ దివిలో ఏర్పాటు
- ఆధునికీకరణ పనులకు దివిసీమలో శ్రీకారం
- అడగకుండానే విజయవాడ డబుల్‌లైన్ కరకట్ట పనులకు నిధులు
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి



పులిగడ్డ వార్పు వద్ద డెల్టా ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)



పులిగడ్డలో డెల్టా ఆధునికరణ పైలాన్



భావదేవరపల్లిలో ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల

అవనిగడ్డ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దివిసీమపై చెరగని ముద్ర వేశారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన డెల్టా ఆధునికీకరణ పనులకు నియోజకవర్గంలోని పులిగడ్డ వార్పు వద్ద శ్రీకారం చుట్టారు. విజయవాడ– పులిగడ్డ డబుల్ లైన్ నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో తొలి మత్స్యకార పాలిటెక్నిక్ కళాశాలను భావదేవరపల్లిలో ఏర్పాటు చేశారు. రూ.40 కోట్లతో దివితీర ప్రాంత సముద్ర కరకట్ట అభివృద్ధి పనులు చేపట్టి రాజశేఖరరెడ్డి దివిసీమ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

**ఆధునికీకరణ పనులకు అంకురార్పణ ఇక్కడే..**
అవనిగడ్డ మండలం పులిగడ్డ వార్పు వద్ద రూ.4,576 కోట్లతో చేపట్టిన డెల్టా ఆధునికీకరణ పనులకు 2008 జూన్ 6న వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతో జిల్లాలో రూ.2,180 కోట్లు, నియోజకవర్గంలో రూ.547.93 కోట్ల విలువైన పనులు జరిగాయి. దీనివల్ల నియోజకవర్గంలో 13 భారీ వంతెనలు, యూటీలు ఏర్పడ్డాయి.

**తొలి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల..**
మత్స్య పరిశ్రమలో సాంకేతిక విప్లవం తీసుకురావాలని వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకాంక్షించారు. మత్స్య పారిశ్రామిక రంగంలో నిపుణులను తయారు చేయాలన్న సంకల్పంతో రాష్ట్రంలో తొలి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలను నాగాయలంక మండలం భావదేవరపల్లిలో ఏర్పాటు చేశారు. 2007 సెప్టెంబర్ 7న అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఈ కళాశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేయగా, అనంతరం భావదేవరపల్లిలో 8.58 ఎకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన భవనాల్లోకి ఈ కళాశాలను మార్చారు. ఈ కళాశాల నుంచి వందలాది మంది నిపుణులు తయారయ్యారు.

**రూ.138 కోట్లతో డబుల్‌లైన్ కరకట్ట రహదారి..**
వరద ప్రాంతాలను చూసేందుకు వచ్చిన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి పులిగడ్డ–విజయవాడ కరకట్ట రహదారి విషయం తీసుకెళ్లగా, అప్పటికప్పుడు స్పందించారు. కరకట్ట డబుల్‌లైన్ అభివృద్ధి పనులకు రూ.138 కోట్లు మంజూరు చేయగా, 2006 మే 27న ఈ పనులకు వైఎస్ శంకుస్థాపన చేశారు. ఈ రహదారి వల్ల అవనిగడ్డ–విజయవాడ మధ్య 22 కి.మీ దూరం తగ్గింది. ప్రస్తుతం అవనిగడ్డ డిపోకు ఈ రహదారే ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

**రూ.40 కోట్లతో సముద్రపు కరకట్ట అభివృద్ధి..**
గతంలో వేసిన సముద్రపు కరకట్ట పూర్తిగా శిథిలమవడంతో ఏ ఉపద్రవం వచ్చినా తీర ప్రాంత ప్రజలు బిక్కు బిక్కు మంటూ కాలం గడపాల్సివచ్చేది. 2004లో సునామీ అనంతరం ఈ కరకట్ట మరింత దెబ్బతింది. గుల్లలమోద నుంచి సాలెంపాలెం వరకూ 22 కి.మీ కరకట్ట రహదారి అభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో రూ.22 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులు చాలకపోతే 2008లో మరో రూ.18 కోట్లు మంజూరు చేయగా, వీటితో కరకట్ట అభివద్ధి పనులు చేశారు.

**రూ.64 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు..**
1978లో వేసిన విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో దివిసీమలో తరచూ విద్యుత్‌కు అంతరాయం కలిగేది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.64 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, కొత్తలైన్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు చేపట్టారు. రూ.35 కోట్లతో అవనిగడ్డలో కొత్తగా 132/32 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వైఎస్ హయాంలో నిర్మించారు. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా దివి ప్రాంత ప్రజలు ఆయన్ను స్మరించుకుంటున్నారు.

## సమ సమాజ నిర్మాణ బాధ్యత ఉపాధ్యాయులదే

మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్: సమ సమాజ నిర్మాణ బాధ్యత పాధ్యాయులపైనే ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ జలాలు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక జార్జి కార్నేషన్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నియోజకవర్గంలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు విద్యను చెప్పిన గురువులను నేను ఎన్నటికీ మర్చిపోనన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయులు మంచి ఉపాధ్యాయుల తర్ఫీదుతోనే ఎదిగారన్నారు. ఆయన రచించిన రాజ్యాంగంలో పొందుపర్చిన ఎన్నకల ప్రక్రియ ఫలితంగానే నేడు ప్రభుత్వాలు మారుతున్నాయన్నారు. చిలకలపూడి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థి 570 మార్కులు సాధించటం ఎంతో శుభపరిణామన్నారు. లక్షలాది రూపాయలను వెచ్చించి ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే 500 మార్కులు రావటం గగనంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 550 పైబడి మార్కులు సాధిస్తుండటం ఉపాధ్యాయుల కృషి ఫలితమేనన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇలానే మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ సమావేశంలో డీఈవో తాహెరాసుల్తానా, డీవైఈవో సింగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైలు నుంచి పడి యువకుడికి గాయాలు



పెడన: గుడివాడ నుంచి మచిలీపట్నం వస్తున్న ప్యాసింజర్ రైలు నుంచి ఒక యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన పెడన పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడివాడ రైల్ పేటకు చెందిన సాయిన గోపాలకృష్ణ (20) మచిలీపట్నం వచ్చేందుకు గుడివాడలో రైలు ఎక్కాడు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్యాసింజర్ రైలు పెడన రైల్వే స్టేషన్‌లోకి వస్తున్న సమయంలో జారి పడ్డాడు. రైలు కింద ఎడమ కాలు పూర్తిగా తెగిపోగా కుడి కాలు బాగా దెబ్బతింది. స్థానికుల సమాచారంతో అంబులెన్స్ సిబ్బంది మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోపాలకృష్ణకు రెండు కాళ్లూ తీసేసి చికిత్స అందిస్తున్నారు. రైల్వే హెచ్‌సీ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

## ఎలక్ట్రీషియన్ కుటుంబానికి సాయం



వెంకటేశ్వరరావు భార్యకు సాయం అందిస్తున్న సర్పంచి శాంత కుమారి, తదితరులు

దాలిపర్రు(ఘంటసాల): మండలంలోని దాలిపర్రు గ్రామానికి చెందిన చొప్పర వెంకటేశ్వరరావు (53) పంచాయతీలో వీధిలైట్లు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై శనివారం సాయంత్రం మరణించాడు. దీంతో ఆదివారం వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని పోస్టుమార్టం అనంతరం దాలిపర్రు గ్రామానికి తీసుకు వచ్చారు. పంచాయతీ తరపున రూ.15 వేల ఆర్థిక సాయాన్ని మృతుని భార్య రాజేశ్వరికి సర్పంచి డోకిపర్తి శాంత కుమారి, ఈవో పి.రాంబాబు అందించారు.

**పలువురి నివాళి..**
వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, టీడీపీ నేతలు వీరమాచినేని భవానీ ప్రసాద్, మిక్కిలినేని మధు, బొందలపాటి నాగేశ్వరరావు, లీలాకృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ కరిముల్లా, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరరావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోపిదేవి నుంచి హంసలదీవికి ఆర్టీసీ బస్సు



మోపిదేవి: కృష్ణా జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి కోడూరు మండలం హంసలదీవి వేణుగోపాలస్వామి దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సును ఆదివారం ప్రారంభించారు. ఇటీవల మోపిదేవిలో దేవస్థానం వద్ద బస్సులు నిలుపు స్థలం పరిశీలించేందుకు అవనిగడ్డ ఆర్టీసీ డీఎం వచ్చిన సమయంలో భక్తులు ఈ రెండు పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. భక్తులు, గ్రామస్తుల కోరిక మేరకు ప్రతి ఆదివారం మోపిదేవి దేవస్థానం నుంచి హంసలదీవికి బస్సు నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు తొలిసారిగా మోపిదేవి నుంచి కోడూరు హంసలదీవికి బస్సులు నడపటంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 10న దేశవ్యాప్త ఆందోళన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ధనశ్రీ

బంటుమిల్లి: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.ధనశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త ఆందోళన విజయవంతానికి కార్మిక సంఘాలు సంఘటితం కావాలని ఆమె కోరారు. పాత కార్మిక చట్టాల సాధనకు సీఐటీయూ ఆందోళన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో పలు అనుబంధ సంస్థల ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, ఏ.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం




గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్లో రోటరీక్లబ్ కౌన్సిల్ సభ్యుడు జి. బాబూశ్రీకర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. 2024 –25 సేవా సంవత్సరం నూతన అధ్యక్షుడిగా టీఎస్ రాజశేఖర్, కార్యదర్శిగా జి. కిరణ్‌బాబు, కోశాధికారిగా నరహరిశెట్టి ప్రసాదు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా జి.నరేష్, ఉపాధ్యక్షుడు వై. సుహాస్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం మరిన్ని సేవలు చెయ్యాలని కౌన్సిల్ సభ్యులు బాబూ శ్రీకర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎ.జ్యోతి, పూర్వ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథుని రథయాత్ర



మూల విరాట్‌ను రథం పైకి చేరుస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో శ్రీ సుభద్రా బలరామ సమేత జగన్నాథుడి రథయాత్ర ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసం విదియ సందర్భంగా ఏటా పూరీలో జగన్నాథుడి రథయాత్ర నిర్వహిస్తారు. వడాలి స్వామివారి ఆలయం తరఫున ఇదే రోజున రథయాత్ర నిర్వహిస్తారు. సుభద్ర బలరామ సమేత జగన్నాథుడి విగ్రహాలు పూరీలో దారు(చెక్క)తో చేయబడిన మూల విరాట్‌తో రథయాత్ర నిర్వహిస్తారు. వడాలి ఆలయంలో సైతం మూల విరాట్ దారు(చెక్క)తో చేసి ఉండడం విశేషం. ఇక్కడ మూల విరాట్‌తో రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రథయాత్ర ముదినేపల్లి సెంటర్, శ్రీహరిపురం మీదుగా సింగరాయపాలెం బావాజీ మఠం వరకు నిర్వహించి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించగా మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహరావు, నేతలు పలువురు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీ, ఎస్టీల్లో రాజకీయ చైతన్యం

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి



కేక్ కట్ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నేత కృష్ణ, ఎమ్మార్పీఎస్ నేతలు

చల్లపల్లి(అవనిగడ్డ): మంద కృష్ణ మాదిగ నెలకొల్పిన ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ద్వారానే ఎస్సీ, ఎస్టీలలో రాజకీయ చైతన్యం పెరిగిందని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. చల్లపల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని, మంద కృష్ణ మాదిగ 60వ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు కేక్ కట్‌చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ స్థాపించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం తెలుగు రాష్ట్రాల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మట్టా రాజా, కొక్కిలిగడ్డ రమేష్‌బాబు, దేవరపల్లి కోటయ్య, మట్టా రాజు, సిద్దేల యలమందయ్య, కొడాలి అనిల్, మేడేపల్లి సుబ్బారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎంఈఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బొకినాల కృష్ణ అన్నారు. మండలంలోని శ్రీకాకుళం పంచాయతీ శివారు సూరపనేనిపాలెం పెద్దగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఎమ్మార్పీఎస్ యువత, గ్రామస్తులు భారీ ర్యాలీ చేశారు. పెద్దగూడెంలోని ఎమ్మార్పీఎస్ స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను గ్రామస్తులతో కలసి కృష్ణ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొడాలి డేవిడ్ రాజు, రాచూరి రాజశేఖర్, పోలిమెట్ల ప్రవీణ్, జంపాన డేవిడ్, చిట్టూరు కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ చంటి, కొడాలి చింటూ, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## బ్రహ్మీదేవి అలంకారంలో వారాహి మాత



కె.కొత్తపాలెంలో దుర్గానాగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బ్రహ్మీదేవి విశేష అలంకారంలో దర్శనమిచ్చిన వారాహి మాత

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామపాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న శ్రీ వారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం అమ్మవారు బ్రహ్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖరశర్మ నేతృత్వంలో వేకువ జామునే వారాహి అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష కుంకుమ పూజ జరిపి, విశేష అలంకారం చేసిన మీదట భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక పూజ, అలంకారం అనంతరం మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి) బోయపాటి రాము కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు విద్యాసాగర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ




పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు వచ్చిన భక్తులు



మల్లంపల్లిలో అమ్మ వార్లకు ఆషాఢ సారె తీసుకెళ్తున్న గ్రామస్తులు

పెడన: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గ్రామ దేవత పైడమ్మ తల్లి అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామ దేవత అత్తింటివారు దాసు వంశీయులు ఒకటో వార్డులోని పైడమ్మ అమ్మవారి దేవస్థానానికి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాఢ సారెను అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

మల్లంపల్లి(ఘంటసాల): మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా రెండో రోజైన ఆదివారం అమ్మవార్లకు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ పర్వతవర్ధినీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పర్వత వర్ధినీఅమ్మవారికి, గంగానమ్మ మందిరంలోని గంగానమ్మకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీరలు, వివిధ రకాల పండ్లతో కూడిన సారెను ఊరేగింపుగా తీసుకొని వచ్చి, ఆయా దేవాలయాలలోని అర్చకులకు అందజేశారు. గ్రామస్తులు ఇచ్చిన సారెతో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శాకంబరి అలంకారంలో పూజలందుకుంటున్న అమ్మవారు

గూడూరు: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కంచాకోడూరులోని శ్రీపార్వతీ సమేత భోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. పూజాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంచాకోడూరు, తరకటూరు గ్రామాలకు చెందిన అర్చక స్వాములతో పాటు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మట్టి అక్రమంగా తవ్వితే చర్యలు

గుడివాడటౌన్: గుడివాడ పట్టణ పరిసర ప్రాంతాల్లో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు హెచ్చరించారు. పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాలకు మట్టిని సరఫరా చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనపర్చుకున్నారు. అనుమతులు లేని మట్టి తవ్వకాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com